

ఆసలు అనుకున్నదయితే రకూడ
దనే అయినా, ఇంటి దగ్గిరిదాకా
వచ్చి వెళ్ళిపోవడం బావుండదని. . .
వచ్చినా ఏముం దిక్కడ? తా నొచ్చానసే
సంతోషం ఎవ్వరిలోను ఉండదు. ఏదో
ఎక్కడ గతి లేక ఇటు వస్తాననుకుంటారు
కాబోలు, కనీసం చిరునవ్వుతో సంకరించ
డంకూడా జరగదు— కాకుంటే హేళనగా
మాటాడడం, హీనంగా తీసెయ్యడంతప్ప.

చూడగానే మూలిగిందత్తయ్య "అబ్బ,
ఎన్ని రోజులకు" అని. "హాస్టల్లో ఎలా
ఉంది?" అని అడిగి, సమాధానం సరిగా
వినకుండానే వెళ్ళిపోయింది. పిల్లలెవరూ
లేరు. ప్లేగ్రౌండ్‌లో క్రికెట్ కెళ్ళారు
కాబోలు. మామయ్య ఆఫీసు నుండి
రాన ట్లనిపిస్తుంది.

"ఓహో, రాధా, ఎప్పుడు వచ్చావు?"
బయటినుంచి వస్తూ అడిగాడు మురళి.
మధ్యహాల్లో కూర్చున్న రాధ ఉలిక్కి
పడి, "ఇప్పుడే, బావా!" అంది. ఆగ
కుండనే లోనికి వెళ్ళి పోయాడు మురళి.
మరో అయిదు నిమిషాల తరవాత
వంటలక్క తాలూకు పంపిన కాఫీ పని
పిల్లాడు తెచ్చాడు. చూసే మాగజైన్
టేబుల్‌మీద వేసి కాఫీ తాగుతూ ఉంటే
బయటికి వచ్చాడు మురళి.

"ఆఁ. . . ఏం విశేషాలు, రాధా,
మీ కాలేజీలో?" అన్నాడు ఎదురుగా
సోఫాలో కూర్చుని సిగరెట్ పొగవదులుతూ.

"ఏమున్నాయ్. . . మామూలే."

"అంతేనా? మరి మా కాలేజీలో వి
చాలా ఉన్నాయి. అన్నట్టు, మరిచాను.
నేను స్టూడెంట్స్ యూనియన్
ప్రెసిడెంట్‌గా ఎన్నికైనాను, తెలుసా?"
గర్వంగా చూశాడు రాధ ముఖంలోకి.

"అలాగా? కంగ్రాచ్యులేషన్స్." చిరు
నవ్వు నవ్వింది రాధ.

"మరి డిన్న రడగవేం?"

ఖాళీకప్పు టేబుల్‌పై పెడుతూ
అంది: "ఏమో, బావా, ఈ బాహ్యాడంబరాల
మీద నాకు మోజు లేదు. హృదయ
పూర్వక కృతజ్ఞతాభినందనలు తెలిపాను.
అంతగా మ న్నిస్తే నే తినలేనని కాదు."

"అసలు నీ కెన్నేళ్ళు?" మొహం
చిట్లించాడు.

"నీకు తెలుసు, బావా!"

"కాని నీవీ శతాబ్దంలో పుట్టాల్సింది
కాదు, రాధా! అమ్మమ్మలా మాట్లాడ
తావు, తాతమ్మలా వేషం వేస్తావు. అందుకే
నాకు కోపం. మా కాలేజి అమ్మాయిల్ని
చూశావా? ఎవయిపోవాలి! అందరూ
మంచి కల్చర్డ్."

"నే నటువంటి వాతావరణంలో
పెరగలేదుగా మరి?"

"ఆఁ. . . దానికేం తెలుసులే
పాపం, అమ్మీ?" దీర్ఘం తీస్తూ వచ్చి
కూర్చుంది అత్తయ్య.

అంటే, ఇదో పల్లెటూరి మొద్దు,
నాగరికతకి క్రొత్త కోతి అని హేళనప్పు
మాట. తన కిక అక్కడ కూర్చో బుద్ధి
కాలేదు. మరో సెలవు దినం చూసుకుని
వస్తానని బయలుపడింది రాధ.

డిప్యూటీ కలెక్టర్ వేణుగోపాలంగారి
పుత్రరత్నం మురళీధర్‌గారు ఓ ఖరీ
దైన మనిషి. ప్రతి మాటలో డబ్బు
పోటు చేసుకుంటుంది. అది రాధ
కసహ్యం. ఖరీదైన బట్టలమీద అంద
మైన అద్దకాలు తప్ప, ముతకగుడ్డల
చాటున దాగిన గుండెల్లోని అగ్నిపర్వతా
లర్థం చేసుకోలేడు.

* * *

"ఏమండీ, రాధగారూ? మీరూ
లేటేనా?"

వెనుతిరిగి చూసింది రాధ—మనోహర్.
తెల్లటి దుస్తులతో నీటుగా తయా
రయి మనోహరంగా ఉన్నాడు. తెల్లటి
శరీరానికి నల్లటి నొక్కుల జుత్తు.
గుండ్రటి ముఖం. 'ఇన్' చేశాడేమో
కొంచెం పొడుగ్గా అందంగా అగుపిస్తు
న్నాడు.

"ఈవేళ వర్షం పడుతుంది తప్పక."
వాంట్ సవరించుకుంటూ రెం డడుగులు
ముందు వేసి రాధతో కలిసి నడుస్తూ
అన్నాడు.

**నాగరికత అంటే ఖరీదైన
బట్టలమీద అందమైన అద్ద
కాలు. అదే సంస్కృతి అని
భ్రమపడేవారు ముతక
గుడ్డల చాటున దాగున్న
గుండెలోని అగ్నిపర్వతాలు
అర్థం చేసుకోలేరు. గంభీ
రంగా, నిరాడంబరంగా
ఉండే నిరలంకృత సౌంద
ర్యాన్ని, హృదయ సౌంద
ర్యాన్ని అర్థం చేసుకుని ఆరా
ధించగలరు. ఒకే స్పందన
గల హృదయాలు చేరువ
కావటంకన్న యోగం
ఏముంది.**

"ఎందుకు?" అర్థం కాక చూసింది.
చిన్నగా నవ్వింది. "అసలివాళేముయిం
దంటే..." కారణం చెబుదామనుకుంది
కాని, ఎదురుగా రాజేశ్వరరాయుడు—
కెమిస్ట్రీ లెక్చరర్. . .

"గుడ్ మార్నింగ్, సర్." అనుకోకుండా
అనేశా రిద్దరూ. 'మాణింగ్...' తల వంచు
కునే, నవ్వుతూ అంటూ దాటి వెళ్ళి
పోయా రాయన.

మనోహర్ వెనుతిరిగి చూశాడు
లెక్చరర్ వైపు. "ఏమండీ, ఈయనపై
మీ అభిప్రాయ మేమిటి?" కనుబొమ్మ
లెగరవేస్తూ అడిగాడు.

"అంటే దేన్ని గురించి?" క్లాసు
వైపు దారి తీస్తూ అడిగింది.

"లెక్చర్స్ గురించి. నాకు చాలా
బాగునిపిస్తాయి." తన అభిప్రాయం చెప్పే
శాడు మనోహర్.

"అలాగా! నా కైతే ఆనందరావుగా
రంటే ఇష్టం." మెల్లిగా, నవ్వుతూ
అంది.

పకాలున నవ్వాడు మనోహర్.
వచ్చే నవ్వు మునిపంటితో బిగపట్టింది
రాధ.

* * *


ఆనందరావుగారుకూడా కెమిస్ట్రీ
లెక్చరరే! కొత్తగా వేరే స్టేట్‌నుంచి
వచ్చారు. అస లాయన పేరు మురారి అని
వినవచ్చింది. కాని, కర్మకొద్దీ ఆయన
చంద్రుడు లా పేరు పెట్టి ఆయన్ని
వెక్కిరింపులు చేస్తున్నారు. ఆయన
తెలిసిన వాళ్ళందరికి ఓ అనుమానం —
ఈయన జీవితంలో ఎప్పుడైనా నవ్వాడా
అని. క్లాసులోకి రాగానే పిల్లలందరూ
లోలోన నవ్వుకోవడం అలవాటు. ఏది
చెప్పినా అతి వేగంగా, గబగబా చెబుతూం
టారు. ఈక్వేషన్స్ వస్తే ఆయనకే
అర్థంకావు. ఊరికే గందరగోళ పడతారు.
పిల్లలు నవ్వేస్తారు. "సైలెన్స్! మానర్
లెస్ ఫెలోస్" అని సీరియస్‌గా బల్ల
గుద్దుతారు. దానితో తక్కువ నవ్వు
రాగుతాయి. ఓ క్షణం తరవాత ఆయన
బోర్డుకేసి తిరగగానే మళ్ళీ గుసగుసలు
మొదలవుతాయి. అందుకే ఆయనకు
'మిస్టర్ కన్ఫ్యూజ్' అని బిరుదు.

చదివి బాగుపడేవారు ఆయన క్లాసులో
ఉండకూడదని కొందరి సిద్ధాంతం.

* * *

ఓరగా వేసి ఉన్న తలుపు తోసుకుని
లోపలికి ప్రవేశించింది రాధ. హఠాత్తుగా
వచ్చి కౌగిలించుకుంది రాణి.

"అయ్యయ్యో, అసలే ఒక్కమ్మాయ్!
[illegible]" కళ్ళద్దా లమ్మాయి అంది.



దేవరాజు
మహారాజు

"అబ్బ! ఇంతసేపెక్కడికి వెళ్లావు? మీ అత్తయ్యవాళ్ళింటికి వెళ్లావా?" ఉండబట్టలేక అడిగింది రాణి.

"లేక..." కొంటెగా చూసింది సుమ.

విస్తుబోతూ చూసింది రాధ, అయోమయంగా.

"టినోపాల్ నువ్వూ... ఏదైనా ప్రోగ్రామ్..."

"టినోపాలేమిటి?" మరీ విస్తుపోయింది.

ఇద్దరూ నవ్వుతున్నారు, పొట్ట చెక్కలయ్యేట్టు. రాధ ముఖం ఎర్రబడింది. ఉన్నట్టుండి చెప్పేసింది రాణి.

"మీ మనోహర్‌గారికి మరో పేరు!"

గతుక్కుమంది రాధ మనసు, ఏమిటో, ఎందుకో?

"ఏయ్! తలేమైనా తిరుగుతూందా? మీ మనోహ రేమిటి?" ఓణీగుడ్డ నోట్లో పెట్టుకుని, నవ్వాపుకునే ప్రయత్నం చేస్తూ సమర్థించింది కళ్ళద్దాల సుమ.

"అంటే, మీ క్లాస్‌మేట్ అన్నమాట."

గుండెలో ఏదో బరువు దిగినట్లనిపించింది. పుస్తకాలు అల్మైరాలో వేసి, బెడ్‌మైన పడిపోయింది రాధ. రాణి కనిపించగానే, వాళ్ళింటి దగ్గర అందరు ఎలా ఉన్నారని అనుకుంది. రాణి తమ్ముడు బాబుంటాడు. ఎర్రగా, గుండ్రంగా కళ్ళు, వేలు తిప్పుతూ, "ఆంటీ!" అంటూ చిన్న చిన్న మాటలు ... ఎంత ముద్దు గొలుపుతాడని! ఓ క్షణం వాడి ముఖం కళ్ళలో మెదిలింది.

"రాణీ! గోపీ..."

"ఛ! ఛ! కాదు. గోపీకృష్ణ గోకులం..." రాణివంక కళ్ళద్దాలపైనుండి చూస్తూ అంది సుమ.

"నిన్నేం కొత్త కొత్త పేర్లెట్టమన్నేదెవరు ఇక్కడ?" బుంగమూతి పెట్టుకుని అంది రాణి, తన అల్మైరా సర్దుకుంటూ.

"అబ్బో, అప్పుడే అంత కోపం? ఇక పెండ్లయితే ఏమైనా ఉందా?" గుండెలమీద చెయ్యి వేసుకుంది.

"ఏమిటేమిటి?" లేచి కూర్చుంది రాధ.

రాధ కళ్ళలోకి చిలిపిగా, సిగ్గుగా చూసి కిలకిలమంది రాణి.

"అబ్బ! చిలకనవ్వు, గోరింక పేరు తీయగానే..."

కందిగడ్డలా మారింది రాణి ముఖం.

"సుమా! మా బుజ్జి సుమా! రాణిని ఏడిపించకు."

రాణిని బుజ్జగించింది రాధ. నవ్వింది సుమ.

"అబ్బా, చెప్పవే, గోపాలకృష్ణ గోకు లెవరే?"

"ఇంకెవరూ? పతియు, గతియు నిజముగ..."

"ఏయ్, సుమా! నాకు కోపం వస్తే మంచిదాన్ని కాదు." కోపంతో అంది రాణి.

"ఏయ్, కోతిపిల్లా! కొంచెం ఆగు, దాన్ని చెప్పనీ." రాధ కలగజేసుకుంది.

"అది చెప్పేదేమిటి? నే చెబుతా, విను, ఆయనగారి పేరు చిన్నయసూరో, పెద్దయసూరో నట. పెళ్ళిచూపు లయ్యాయి. ఆయనగారిది కుంభకర్ణుని ఒళ్ళు. గోపాలకృష్ణుని రంగు..." అని నోటిగుండా గాలి పీల్చి లొట్టవేసి మళ్ళీ అంది సుమ: "నోరు కాస్త బొంగు"

తలుపు తట్టారెవరో. వెళ్ళి చూసింది రాధ.

"ఫోనొచ్చింది, సుమమ్మగారూ." ప్యూన్ చెప్పి వెళ్ళాడు.

"అమ్మా, దండం! ఇక వెళ్ళు" అంది రాణి.

ఏం మాట్లాడకుండా, చిన్నగా నవ్వుతూ వెళ్ళిపోయింది సుమ.

"అన్నీ కొంటె గా గుణాలు" అంది రాణి కసిగా.

"సరే, పార్కులో కూచుందాం పద. లేకుంటే అది మళ్ళీ వస్తుంది. నే కాస్త మొహం కడుక్కువస్తానుండు." బయటికి వెళ్ళింది రాధ.

"ఆఁ... ఇప్పుడు చెప్పు విశేషాలేమిటో" అని మొదలెట్టింది రాధ.

"విశేషాలేమిటి. అంతా ఇదివర కనుకున్నదే" అంది సుమతి.

"అయితే మీ బావ నిన్ను ప్రేమిస్తాడటే?"

"ఓ...మొన్నేమయిందనుకున్నావు? నా అభిప్రాయం స్వయంగా తెలుసుకుందామని ఒక్కదాన్ని పిలిచి అడిగాడు." గడ్డి పీకుతూ చెప్పింది సుమతి.

"నీ వేమన్నావు?"

సమాధానం చెప్పకుండానే సిగ్గుతో నవ్వుతూనే ఉంది.

"అవును, సుమతీ, నీ వదృష్టవంతురాలివు. ప్రేమించడంకన్న ప్రేమించబడటం గొప్ప అనిపిస్తుంది నా మట్టుకు. నాకు తెలుసు, నన్నెవరూ ప్రేమించరని. 'అసలు ప్రత్యేకంగా నా లాంటి వారి జీవితాల కొరకే కన్నీళ్ళు సృష్టించాడా దేవుడు' అనిపిస్తుంది..."

"ఏమిటే, రాధా! వేదాంతం మాట్లాడుతున్నావు. ఉండు రేడియో ఆన్ చేస్తాను" అంటూ హాండ్ బాగ్‌లోని ట్రాన్సిస్టర్ తీసి ఆన్ చేసింది సుమతి. ఎవరిదో స్వీయకవితా పఠనం వస్తూంది.

పబ్లిక్ గార్డెన్ చాలా అందంగా ఉంది.

జంటలు, జంటల వెంట పిల్లలు. . . పిల్లగాలులు. . .

"టినోపాల్ అని పేరెవరుపెట్టారే?" అడిగింది రాధ.

"అదే...ఆ కోతి..." వినుగ్గా చెప్పింది సుమతి.

"దానికి ఇతరుల నేడిపించడంతప్ప, వేరే పని లేదు. అస లది అంతగా నవ్వుతుంది గదా! రేపు. . ." ఏదో చెబుదామని తక్కున ఆగిపోయి, రేడియో వినడం మొదలెట్టింది రాధ.

"ఏమి టలా ఆగావు?"

"ష్...కొంచె మాగు. ఇది వినుబావుంది." 'చిరునవ్వు వెనక్కి
మలె్తిక్కిన కొవ్వు దాగిన
గులాబీ నా కొద్దు—
అది క్రోధపు మగ్గంపై
ద్వేషపు వలువల నేస్తూంటుంది గనక!
మధురంగా ఆహ్వానించే,
మల్లెపూలైనా అస లొద్దు
నాతోబాటు అది
విషపు కోరల్ని ఆహ్వానిస్తుంది గనక!
నిస్సహాయంగా చూచే,
గడ్డిపూవుకే నా స్నేహ హస్తం!
దానికే నా జీవిత సమస్తం!
అదే నా తెలుపుకు హర్షిస్తుంది.
అదే నా నలుపుకు దుఃఖిస్తుంది.
అదే నన్ను ప్రేమిస్తుంది'—

"ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం...ఇంతవరకు మీరు సుధగారి స్వీయకవిత విన్నారు. తరవాత కార్యక్రమం కొద్ది క్షణాల్లో వింటారు."

"అబ్బా ఎంత చక్కగా రాసిందో!" నిట్టూరుస్తూ అంది రాధ.

"గడ్డిపూ మేమిటి? పిచ్చిపూవు! నా కొక్క ముక్క అర్థం కాలేదు."

"అర్థం కాకపోవటాని కేముంది? సరిగ్గా నా భావాలు, అదీ భావాలు ఒకెలా ఉన్నాయి. పద, వెళ్లి కలిసొద్దాం సుధగారిని."

"రేడియో స్టేషనుకా?"

"అవును. రోడ్డు క్రాస్ చేస్తే అదే కదా." లేచింది రాధ.

ట్రాన్సిస్టర్ బాగ్‌లో వేసి, రాధ ననుసరించింది సుమతి. రెండు నిమిషాల్లో ఆకాశవాణి చేరా రిద్దరు.

"ఉన్నారో,లేదో నే మొదలు చూసొస్తానుండు." వరండాలోనే సుమతి నొదిలి ఆఫీసులోకి వెళ్లింది రాధ.

బయట రోడ్డుమీంచి వేళ్లే జంటను చూసి, తన పక్కన బావ నూహించుకుని సంబరపడిపోతూంది సుమతి. మరో రెండు నిమిషాల్లో పేలిన మొహంతో వచ్చింది రాధ.

"అది ఇదివర కెప్పుడో రికార్డు చేసిందటనే! అడ్రసు అడిగితే ఇచ్చారు. కోఠిలోనుట ఆవి డుండేది. మనకు హాస్టల్‌కు దగ్గరే! ఎప్పుడైనా కలిసొద్దాం. ఇంతకీ ఇప్పుడు చదివింది సుధగారు కాదు. రేడియో ఆర్టిస్ట్ ఎవరోనట."

పరధ్యానంగా విని, "సరే. పద" అంటూ బస్ స్టాండ్ కేసి దారి తీసింది సుమతి.

* * *

తలుపు తట్టిన చప్పుడుకు ఆనందరావు గబగబా వెళ్లి తలుపు తెరిచాడు.

ఆశ్చర్యపోయి, "నమస్కారమండీ!" అంది రాధ.

"నమస్కారం. . . మీరు. . . నా క్లాసులోని అమ్మాయిలు కదూ!"

"అవునండి! నే నొక్కత్తినే. మా సుమతిది వేరే కాలేజీ" అంది రాధ.

"ఓహో! రండి, కూర్చోండి . . . రండి." ఆహ్వానించా రాయన.

"సుధగారిని కలవాలని వచ్చామండీ." కూచోకుండానే ప్రశ్నించింది రాధ.

"ఎందుకు?" అర్థాంతరంగా ప్రశ్నించాడు ఆనందరావు.

"పత్రికల్లో సుధగారి రచనలు చదివాను. ఈ మధ్యనే ఆవిడ ఆకాశవాణి ప్రసారం విన్నాక కలవాలనిపించింది. వారు నాకు బాగా నచ్చారు."

"అయితే, ప్రస్తుతానికి వా రిక్కడ లేరు!" చిన్నగా నెత్తి గోక్కుంటూ చెప్పాడు. "వారి ఫోటో ఒకటి ఉంది, చూస్తారా?" ఈ ప్రశ్నకు సమాధానం కొరకు ఎదురుచూడకుండానే, పక్క గదిలోకి దారితీశాడు ఆనందరావు.

అదొక పెద్ద గది. గోడలకన్నీ ఫ్రేమ్స్ కట్టిన పెయింటింగ్స్ ఉన్నాయి. కిటికీ గుండా ధారాళంగా వెలుతురు వస్తూంది. ఒక అలమార నిండా తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలున్నాయి. ఆడంబరంగాఅలంకరణ లేవీ లేవు. కాని, ఎంతో పరిశుభ్రంగా ఉంది.

కిటికీ పక్కనున్న ఓ చిన్న ఫోటో ముందు ఆగాడు ఆనందరావు.

"ఈవిడే సుధ."

"ఇంత చిన్నపిల్లా!" ఆశ్చర్యపోయి అడిగింది సుమతి.

సరిగ్గా వాళ్ల ఇంట్లో మధ్య హాల్లో ఉన్న తన చిన్నప్పటి ఫోటో, దానితో నందమనే కుర్రాడు జ్ఞాపకానికి వచ్చారు రాధకు. ఏదో అందా మనుకుంది కాని, అనలేకపోయింది.

"పదేళ్లు కూడా సరిగా లేవు" అని ఫోటో కింది భాగాన వ్రాసి ఉన్న తేదీ పరీక్షగా చూసి, "ఇది చాలా పాతది కదండీ! బహుశః ఇప్పటికి పెద్దదై ఉంటుంది" అంది సుమతి.

"అవును...అయి ఉంటుంది." ఎటో చూస్తూ అన్నాడు ఆనందరావు.

"అయిఉంటుందంటున్నారు...మీరు చూశ్లేదా ఈమెని? ఎప్పుడొస్తుం దిక్కడికి?" అర్థంకాక అడిగింది సుమతి.

"ఎప్పుడో ఒకప్పుడు తప్పక వస్తుందనే ఆశ మాత్రం ఉంది!" నిరాశతో చెప్పాడు ఆనందరావు.

"ఆ అమ్మాయి పేరు రాధ. కాని ఆ పేరిష్టంలేక 'సుధ' అని పెట్టుకున్నాను. ఆ పేరుతోనే రాస్తున్నాను. ఈ పెయింట్స్ గీస్తున్నాను. . ."

పూర్తికాకముందే అడిగింది సుమతి: "ఇప్పు డామె ఎక్క డుందండి?"

"అదే తెలీదు. నేను ఢిల్లీలోనే బి. ఎస్‌సి. లో చేరిన కొత్తలో వాళ్ల నాన్న వ్రాశారు—ఆ అమ్మాయికి టైఫాయిడ్ బాగా వచ్చింది, ఇక ఆశ వదులుకున్నట్లే అని. ... అంతే. అదే ఆఖరు ఉత్తరం. ఇప్పుడు వాళ్లెక్కడున్నారో తెలీదు."

"ఆ అమ్మాయి పక్కన పెద్ద పిల్లాడెవరండి?" సుమతి.

చిన్నగా నవ్వుకున్నాడు ఆనందరావు. "చిన్నప్పుడు నేనే..."

నాలిక కొరుక్కుంది సుమతి.

ఆ గది దాటి ఇవతలిదాకా వచ్చి, "మీ అమ్మా వాళ్లు లేరాండి?" అని ఆడవాళ్లెవ్వరూ కనిపించనందుకు అడిగింది సుమతి.

"అంత భాగ్యానికి నోచుకోలేదు. ఉన్న ఒక్క పెదనాన్నగారు ఢిల్లీలో బిజినెస్ చేసేవారు. నన్ను తీసుకెళ్లి చదివించారు. ఓ సంవత్సరం క్రితం వారుకూడా కన్నుమూశారు."

రాధ మొహంలోకి చూసింది సుమతి. ఎటో పరధ్యాన్నంగా చూస్తూంది. "పద,



నంబరం

ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

పోదాం" అనగానే ఉలిక్కిపడి "పద" అంది.

"నమస్కారమండీ" అంటూనే గేటు వైపు నడిచా రిద్దరూ.

"పోదామని ఇంత హంగామా చేసి, తీరా వెళ్ళాక బెల్లంకొట్టిన రాయిలా నోరు మెదపలేదెందుకే?" ఉన్నవిసుగంతా రిక్షాలో కూచున్నాక కక్కేసింది సుమతి.

"ఏం మెదపను. ఆయన చూపిన ఫోటో నాదే."

"నీదా!" ఆశ్చర్యపోయింది.

"అవును. ఆయనగారు చిన్నప్పుడు మా నాన్నగారి దగ్గిర చదువుకునేవారు. మా నాన్నగా రాయన్ని 'నందం' అని పిలిచేవారు. చిన్నప్పుడు కాలు జారి నే బావిలో పడితే తీసింది వీరే. ఇదిగో, ఆ గుర్తు ఇంకా ఉంది. ఇద్దరం కలిసి పొలాలు, తోటలు ఏకంగా తిరిగేవాళ్లం." చెప్పుకుపోతూంది రాధ.

ఆశ్చర్యపోవడం ఆపి, అంది సుమతి: "అమ్మ దొంగా! చెప్పవేం మరి? నీ వెర్రిచూపులు చూసి అప్పుడే అనుకున్నా! నేనే చెప్పి ఉందును. ఈవిడేనండి ఆ అమ్మాయి. పెళ్లింకా చేసుకోలేదు. . . మరి. . ."

"ఏయ్,సుమతీ, పిచ్చిగా మాట్లాడకు. ఇప్పటి నా ఈ వికృతరూపం చూసి, ఆ అమ్మాయి నే నని తెలిస్తే అసహ్యించు కోరూ? టైఫాయిడ్ నుంచి బయటపడ్డాక అగ్నిప్రమాదం సంభవించి ఈ చెంప నొసలు కాలిందని ఆయనకు తెలీదు. అందుకే పోల్చుకోలేదు."

"ఆయ నలాంటివారు కానట్టుంది, రాధా! ఆయనకు కావలిసింది మంచి మనసు. నేను రేపు వెళ్లి. . ."

"ఒద్దు, సుమతీ, ఒద్దు! ఆయన్ని ఆ ఊహాలోకంలోనే ఉండనీ. నిజంలోకి దింపి, నా రూపం చూపి, ఆయన్ని బాధ పెట్టకు. నిజంకన్న ఊహ ఎంతో తీయగా, హాయిగా ఉంటుంది."

"ఇంక నీ వేమీ మాట్లాడకు. ఆయన కవిత్వమేమీ అర్థం కాలేదు. కాని నీవు కనిపిస్తే ఆయ నెంత సంబరపడి పోయేది ఆయన మాటలవల్ల అర్థ మయింది."

ఏదో చెప్పబోయింది రాధ.

"మళ్లీ!" ... అని తీక్ష్ణంగా రాధ కళ్లలోకి చూసింది. "అలాగైతే ఇదంతా సుమకు చెబుతా నుండు."

గుభేలుమంది రాధ మనసు. "అంత పని చేసి నన్ను నవ్వులపాలు చేయకు, సుమతీ."

రిక్షా ఆపి నిలబడి ఉన్న రిక్షావాడిని చూసి, మాట లాపి దిగా రిద్దరూ. డబ్బు లిచ్చేసి గేటులోకి నడుస్తూ, "అదిగో, టినా. . ." మెల్లగా అని ఆగింది సుమతి.

అర్థంకాక నాలుగు దిక్కులు చూసింది రాధ.

ప్రకాశరావు ఎవరితోనో వస్తున్నాడు.

"ఏమండి, రాధగారూ, ఎటో వెళ్లారు? అన్నట్టు ఈవిడ. . ."

"ఆగిపోయారేం?"

"ఏం చెయ్యను? ఈ మధ్య మగాళ్లు సిగ్గు పడవలిసి వస్తూంది." నవ్వాడు. "కాబోయే మిసెస్. వచ్చే నెల్లో పెళ్లి. షాపింగ్‌కి వెళుతున్నాం."

"ఐ సీ! కంగ్రాచ్యులేషన్స్"— చేయి కలిపిం దావిడతో రాధ.

"వెళ్లొస్తామండి" అంటూ వెళ్లి పోయా రిద్దరూ.

రాత్రంతా ఏవో ఆలోచనలు. . , కన్నంటుకోలేదు. ఊహాలు. . . వెను వెంటనే నిరాశ. కన్నీళ్లు. . . నిద్ర పట్టలేదు రాధకు.

హాస్టలంతా నిశ్శబ్దంగా ఉంది. ఆకాశంలో ఓ విమానం వెళుతున్న చప్పుడు. దూరంగా ఎక్కడో ఓ కుక్క కూత,కారుమోత లీలగా వినిపిస్తున్నాయి. పక్కన బెడ్‌పై సుమతి అటు తిరిగి ఏమిటో కలవరిస్తూంది.

రాధ ఏమేమో గొణుక్కుంది. కాని, ఎవరూ లేరు వినిపించుకునేందుకు. ఆఖరున ఆనందరావు కనిపించారు కళ్లకి. బరువుగా శ్వాస వదిలి, 'మీ రనుకున్న గడ్డిపూవుని నేనేనండి' అనుకుంది. వాళ్ల నాన్నగారు మెరిసే కళ్లతో ఆశీర్వదిస్తు న్నట్టు అగుపించారు. ఏదో బరువు దిగిన ట్లనిపించింది. తెల్లవారుఝామున నిద్రపోయింది.

* * *

'ఫస్ట్ పీరియల్ అయిపోయేటట్టుంది' అనుకుంటూనే గబగబా గేటు దాటి వెళుతున్న రాధను వాళ్ల క్లాసుమే టమ్మాయి రమ ఆపింది.

"ఏం, క్లాసు లేదా?"

"కాలేజీ లేదు."

మనసు కొంచెం తేలిక పడింది రాధకు. "ఏం...ఎందుకు?"

"అయ్యో, నీ కింకా తెలీదూ? మన ఆనందరావు లెక్చరర్ చనిపోయారు."


"ఆఁ. . . ఆనందరావుగారా . . . చనిపోయారా! నే నమ్మను."

"నిజం, రాధా! కాలేజీకి వస్తూంటే ఆక్సిడెంట్ అయి. . ."

రాధ తలంతా తిరుగుతూంది. అంతా అయోమయం. ఏదో భూకంపం సంభవించినట్టు. అసలు భూమి అంతా కొట్టుకుపోయి సముద్రంలో కలిసినట్టు తలంతా దిమ్ముగా అయింది. ఒక్క క్షణం ఉండలేకపోయింది.

"మార్నింగ్ షోకి వెళదాం,వస్తావా?" రమ అంటున్న మాటలు వినిపించుకునే స్థితిలో లేదు రాధ.

ఎలా రిక్షా ఎక్కిందో, ఎలా రూమ్ చేరిందో భగవంతుడికే తెలియాలి. మొహ మంతా కందగడ్డలా అయింది. గుండె దడదడ కొట్టుకుంటూంది. మొదటి నించి తన్ను హీనంగా చూస్తున్నాడు దేవుడు. చిన్నప్పుడు బావిలో పడ్డప్పుడు అలాగే చనిపోతే బావుండేది. ముద్దు లేదు, ముచ్చటా లేదు. కాళ్లకింద నలిగి పోయే గడ్డిపూవుని నేను!



దైవసన్నిధి(కంచి) ఫోటో—ఎస్. ఎస్. వరదని

కాలిన తన ఆకారం ఎవర్నీ ఆకర్షించ దని తెలుసు. కాని, ఒక్కరు మాత్రం తన హృదయాన్ని ప్రేమిస్తున్నారని తెలిసి, కొంచెం ఊరట కలిగి, జీవితం మీద ఆశ కలిగింది. కాని, నేటితో అదికూడా. . .

రూమ్ తలుపులు గట్టిగా వేసి, గడియ వేసుకుంది రాధ.

తలుపు బడబడా కొడుతున్నారు ఎవరో... "నేను, రాధా!నీ రూమ్ మేట్‌ని-సుమతిని. తలుపు తియ్యి." కేకలు వినిపించ గానే లేచి తీసింది రాధ. లోపలికి రాగానే తలుపు వేసింది సుమతి.

"అయ్యయ్యో, కాలేజీకి వెళ్లక ఏడుస్తున్నా వెందుకు?"

సుమతి కళ్లలోకి దీనంగా చూసి, తల వంచుకుని కూర్చుంది రాధ.

"ఆఁ... అయితే, ప్లాన్ పారిం దన్న మాట!" చిటికె వేస్తూ కూర్చుంది రాధ పక్కన.

అయోమయంగా చూసింది రాధ.

"ఆనాడు ఆనందరావుగా రింటికి వెళ్లి వచ్చావు. మరునాడే వెళ్లి చెప్పివచ్చాను. ఈవేళ మేమిద్దరం మీ క్లాస్‌మేట్ సహాయంతో నిన్ను టెస్ట్ చేశాం. . . ఆనందరావుగారి కేం ఫరవా లేదు. ఆనందంగా ఉన్నారు." కిలకిలా నవ్వింది సుమతి.

"సుమతీ!"

"అవును, రాధా! అటు కిటికీగుండా చూడు, బయట గేటు దగ్గిర ఆనందరావు గారు నీ కోసం. . ."

గబగబా వెళ్లి చూసింది రాధ. ఆనందరావుగారు!. . .

సన్నగా, పొడుగ్గా తెల్లటి దుస్తులతో మెరిసిపోతూ, హాస్టల్ వైపే దీనంగా చూస్తున్నారు — క్షణమొక యుగంగా, వేయి కళ్లతో ఎదురు చూస్తున్నట్టు. . .

"త్వరగా తయారవు."

మనసంతా తేలికయింది రాధకు.

"సుమతీ!"కౌగిలించుకుంది సుమతిని.

రాధ కళ్లు తళుక్కున మెరిశాయి. ★